## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

నిజాంపేట్, డిసెంబర్ 9 : కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. మండలం కేంద్రానికి చెందిన అవుసుల భాస్కర్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేందర్‌కు శనివారం రూ. 2లక్షల చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ సభ్యత్వం చేసుకున్నందున కుటుంబ సభ్యులకు అండగా ఉండేందుకు ఆర్థిక సహాయన్ని అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మండలం వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరి, నాయకులు రాంచందర్ పాటిల్, వార్డు సభ్యులు నర్సింహులు, యాదగిరి, పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు

హత్నూర, డిసెంబర్ 9 : నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి హత్నూర మండల బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడానికి వెళ్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ఉదయం ఆమె స్వగృహంలో ఎంపీపీ నర్సింహులు, బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు కిశోర్, సాజిద్, కృష్ణ, జగదీశ్‌లు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ నర్సింహులు, నాయకులు

## ప్రజలు.. అభివృద్ధికి పట్టం కట్టారు

గుమ్మడిదల, డిసెంబర్ 9 : పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టడం వల్లే బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గూడెం మహిపాల్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారని గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గడిచిన పదేండ్ల కాలంలో మాజీ సీఎం కేసీఆర్ పాలనలో పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వేలకోట్ల నిధులతో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు అభివృద్ధిని చూసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి విజయం అందించారని పేర్కొన్నారు. శనివారం హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే జీఎంఆర్ మరింత అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన నవరత్నాల మ్యానిఫెస్టోను దశలవారీగా అమలు పరుస్తారని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి మండల ప్రజల తరపున, బీఆర్ఎస్ శ్రేణుల తరపున శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జహీరాబాద్, డిసెంబర్ 9 : కుటీర పరిశ్రమల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కేంద్రప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని జహీరాబాద్ కేవీకే శాస్త్రవేత్త హేమలత తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు స్త్రీశక్తి క్రెడిట్ పథకంలో మైక్రో ఇంటిప్రెన్సెస్‌పై అవగాహన కలిపించారు. చిరుధాన్యాల పంటల సాగుతో ఎలా ఆదాయం సాధించాలో వివరించారు. డీడీఎస్– కేవీకే ఆధ్వర్యంలో విక్సిత్ సంకల్ప భారత్ యాత్ర ప్రోగ్రాంపై మహిళలకు అవగాహన కల్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్ ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి యోజన స్వచ్ఛ భారత్ జనధన్ యోజన, డ్రోన్ దిది యోజన పథకాల గురించి వివరించామన్నారు. భూమి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి.. ఎలాంటి పరిస్థితులు ఉంటాయే వివరించారు. భూసార పరీక్ష ఫలితాలతో చూసి పంటలు సాగు చేయాలన్నారు. ప్రతి ఏడాది పంటల మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో వీకేవీ ఇన్‌చార్జి హెడ్ డాక్టర్ ఎన్. స్నేహలత, భూసార పరీక్షల నిపుణులు స్వామి, శ్రీకాంత్, మహిళా రైతులు మొగులమ్మ, లక్ష్మీమ్మ, ఇంద్రసేనరెడ్డి ఉన్నారు.



జహీరాబాద్ : ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న డీఎస్పీ రఘు



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మహిళాలతో ప్రయాణిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ శరత్

# 'మహాలక్ష్మి' పథకం ప్రారంభం

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన డీఎస్పీ రఘు

జహీరాబాద్, డిసెంబర్ 9 : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జహీరాబాద్ డీఎస్పీ రఘు తెలిపారు. శనివారం జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహాలక్ష్మి పథకాన్ని డీఎం సూర్యనారాయణతో కలిసి డీఎస్పీ రఘు ప్రారంభించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసే సౌకర్యం ఉందన్నారు. ఉచితంగా ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులో ప్రయాణించే అవకాశం ఉందన్నారు. మహి ళలు ఎద్దైనా గుర్తింపు కార్డులు వెంట తెచ్చుకోవాలన్నారు. జహీరాబాద్ నుంచి లింగంపల్లికి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజరు సూర్యనారాయణ, జహీరాబాద్ రూరల్ సీఐ. వెంకటేశ్, పట్టణ ఎస్ఐ. శ్రీకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, నాయకులు ఎంజీ. రాములు, ఖాజామియాతో పాటు పలు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పటాన్‌చెరులో మహాలక్ష్మి పథకం ప్రారంభం**

పటాన్‌చెరు, డిసెంబర్ 9 : పటాన్‌చెరు బస్ టెర్మినల్‌లో మహాలక్ష్మి పథకాన్ని శనివారం కాంగ్రెస్ నాయకుడు కాట శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఆర్టీసీ బస్సుకు కాంగ్రెస్ నాయకులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బస్సు ముందుకు కదిలింది. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన 6 గ్యారంటీల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ముఖ్యమైనదన్నారు. ప్రమాణ స్వీకారం చేసిన మూడు రోజుల్లోనే తమ ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ప్రారంభించిందన్నారు.

మహిళలకు ఎంతో ఉపయోగకరమైన పథకం అని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్‌లు వెంకన్నయాదవ్, గోపాల్‌రెడ్డి, శివానందం, చంద్రయ్య, రహీం, గోపాల్, సంతోశ్, నర్సింహులు, ఎట్టయ్య, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**బస్సును ప్రారంభించిన డీఎస్పీ**

నారాయణఖేడ్, డిసెంబర్ 9 : పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో మహిళల ఉచిత ప్రయాణ బస్సును ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, స్థానిక డిపో మేనేజర్ మల్లేషయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి కూడా ఈ కార్యక్రమానికి హాజరు కాగా, అధికారులతో పాటు ఆమె పచ్చ జెండాను ఊపి ప్రారంభించారు. అనంతరం బస్సులో తోటి మహిళలతో కలిసి ప్రయాణం చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్‌లో పచ్చజెండా ఊపి ఉచిత మహిళా ప్రయాణం బస్సును ప్రారంభిస్తున్న డీఎస్పీ, పక్కనే ఎమ్మెల్యే సతీమణి అనుపమారెడ్డి

## హుస్సేన్ దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే సంజీవరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మనూరు, డిసెంబర్ 9 : మండల కేంద్రంలోని జరుగుతున్న యాదుల్ల హుస్సేన్ దర్గాను నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోల సంజీవరెడ్డి శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. మండల కేంద్రంలో రెండు రోజులుగా దర్గా ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది మనూరు మండల కేంద్రానికి మొదటిసారి రావడంతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువా పూలమాలలతో సన్మానించారు. అనంతరం దర్గా వద్ద ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డిగంబర్‌రెడ్డి, సంగన్న, సాయిలు పాల్గొన్నారు.

## తడ్కల్‌లో ఆటో యూనియన్ సభ్యుల ధర్నా

కంగ్టి, డిసెంబర్ 9 : మండలంలోని తడ్కల్‌లో శనివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశా రు. ఈ సందర్భంగా యూనియన్ బాధ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రకటించడంతో తమ బతుకులు అగమ్యగోచరంగా మారుతాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు పింఛన్ అందించి, తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాయాగౌడ్, మారుతీపటేల్, ప్రకాశ్‌గౌడ్, పండరి, శంకర్, సలీం, రాజాగౌడ్, శేఖర్ ఉన్నారు.

## గడ్డపోతారంలో పడిపూజ

జిన్నారం, డిసెంబర్ 9 : గడ్డపోతారంలో అయ్యప్ప పడిపూజ శనివారం కనుల పండువగా జరిగింది. సర్పంచ్ ప్రకాశ్‌చారి నిర్వహించిన అయ్యప్ప పడిపూజ శ్రావణ్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగింది. అయ్యప్ప స్వామి విగ్రహ ఊరేగింపు, ఆభరణాల ఊరేగింపు, పద్దెనిమిది మెట్ల పడిపూజ అందరిలో భక్తిని నింపింది. పడిపూజకు రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేశ్, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, జిల్లా కుర్మ సంఘం నాయకుడు నగేశ్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ బాశెట్టిరాజు, ఉపసర్పంచ్ మమతాపెంటేశ్, వివిధ గ్రామాల గురుస్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## గురుకులాన్ని తనిఖీ చేసిన జడ్జి

నారాయణఖేడ్, డిసెంబర్ 9: నారాయణఖేడ్ పట్టణ శివారులోని కస్తూర్బా బాలికల విద్యాలయం, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, జూనియర్ కళాశాలను ఖేడ్ సివిల్ కోర్టు మేజిస్ట్రేట్ మంథని శ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో వసతులు, వంటగది, కూరగాయలు, స్టోర్ రూం, బియ్యం, పప్పులు, సరుకులు, డైనింగ్‌హాల్, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆయా తరగతి గదులో వెళ్లి విద్యార్థులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.



నారాయణఖేడ్‌లో హాస్టల్‌ను తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి మంథని శ్రీధర్

## సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

జిన్నారం, డిసెంబర్ 9 : జిన్నారం శివారులోని రంగరాముల ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. గ్రామానికి చెందిన సుమారు ఇరవై జంటలు సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. జిన్నారం నుంచి రంగరాముల ఆలయం వరకు దేవతా మూర్తులను ఊరేగించారు. సత్యనారాయణస్వామి వ్రతాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్యశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ లావణ్యనరేశ్, కోదండరామాలయ అధ్యక్షుడు భోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.